క్లుప్తంగా

ఇన్నాళ్లకు ఏజెన్సీ గుర్తుకొచ్చిందా..?

చర్ల: ఇంతకాలం ఏజెన్సీ వైపు కన్నెత్తి చూడని ఎంపీ కవిత, ఎమ్మెల్సీ తాతా మధు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావులు.. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలు ఉండడంతో బయటకు వస్తున్నారని జెడ్పీటీసీ సభ్యురాలు ఇర్పా శాంత విమర్శించారు. చర్లలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఏజెన్సీ సమస్యలను పట్టించుకోకపోగా ప్రజలకు సైతం ఏమీ చేయలేదన్నారు. కాగా, కాంగ్రెస్‌కు ప్రభుత్వం విజయవంతంగా వంద రోజుల పాలన పూర్తి చేసుకుని, హామీలను నెరవేర్చిందని ఆమె తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్ విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్సై

అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డిపల్లి నూతన ఎస్సైగా సీహెచ్. చంద్రశేఖర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం జరిగిన బదిలీలో భాగంగా అన్నపురెడ్డిపల్లి ఎస్సైగా పనిచేస్తున్న షాహీన కొత్తగూడెం వీఆర్‌కు బదిలీపై వెళ్లారు. కొత్తగూడెం సీసీఎస్‌లో పనిచేస్తున్న చంద్రశేఖర్ అన్నపురెడ్డిపల్లికి బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. తొలిత ఆలయాల్లో స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు.

తాగునీటి ట్యాంకు ప్రారంభం

చంద్రుగొండ: మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు సింగరేణి సంస్థ సహకారంతో నిర్మించిన వాటర్ ట్యాంకును జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ రసూల్, ఎంపీటీసీ లంకా విజయలక్ష్మి శనివారం ప్రారంభించారు. గ్రామంలోని తాగునీటి ఎద్దడి ఉన్న వీధులకు ట్యాంకు ద్వారా నీటిని సరఫరా చేసేందుకు పైప్‌లైన్ల నిర్మాణానికి కలెక్టర్ రూ. 4 లక్షలు నిధులు మంజూరు చేశారు. దీంతో పైప్‌లైన్ విస్తరణ పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఆర్ డబ్ల్యుఎస్ ఏఈ సాయికృష్ణ, సెక్రటరీ శివ, నాయకులు దారావత్ రామారావు, మచ్చా కుమార్, పసుపులేటి మంగయ్య, జాకీర్, మంగయ్య, ఆకుల రాము పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు



నారాయణపురంలో ఫ్లెక్సీని తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రాజకీయ పార్టీలకు సంబంధించిన ప్రచార ఫ్లెక్సీలను శనివారం సాయంత్రం నుంచి తొలగించే పనులు చేపట్టారు. మండలంలోని నారాయణపురం గ్రామంలో పలు చోట్ల ఉన్న కాంగ్రెస్, బీఆర్ఎస్‌తోపాటు పలు పార్టీల ప్రచార ఫ్లెక్సీలను పూర్తిగా తొలగించి పంచాయతీ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఏలాంటి పార్టీ ప్రచార ఫ్లెక్సీలూ ఉండొద్దని అన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మణుగూరుటౌన్: సింగరేణి సేవా సమితి, వైద్యఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ పరిధిలోని పద్మగూడెంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు రవికుమార్ 52 మంది స్థానిక ప్రజల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుని మందులు అందించారు. పరిశుభ్రతపై సూచనలిచ్చారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ సౌందర్యవతి, సిబ్బంది రాము, నవీన్ తదితరులు ఉన్నారు.

మెనూ పాటించండి

చంద్రుగొండ: మధ్యాహ్న భోజన పథకం అమలులో మెనూ విధిగా పాటించాలని ఎంపీడీఓ అశోక్ నిర్వాహకులకు సూచించారు. మండల కేంద్రం చంద్రుగొండలోని జెడ్పీపాఠశాలలో శనివారం వంటకాలను పరిశీలించారు. వంటకాలు చేసే సమయంలో పరిశుభ్రత పాటించాలన్నారు. వేసవిలో సమస్యలు తలెత్తకుండా జగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

బీజేపీ గెలుపునకు కృషి చేయాలి

మణుగూరురూరల్: త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు ప్రతి ఒక్క కార్యకర్తా కృషి చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక బీజేపి కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పార్టీని పటిష్టం చేయాలన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు జంపన సీతారామరాజు, తాటిపాముల ఐలయ్య, పున్నం బిక్షపతి, పాడియం బాలరాజు, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరావు, శ్రీరామ్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సహర్.. ఇఫ్తార్..!

- రంజాన్ వేళ రెండింటికీ ప్రాధాన్యత
- ఉపవాసానికి ముడిపడిన ఆ రెండు పదాలు
- నెల రోజులపాటు తరచూ వాటి ప్రసావనే..



ఉపవాసం అనంతరం ఇఫ్తార్ చేస్తున్న ముస్లింలు

అశ్వారావుపేటరూరల్: పవిత్రమైన రంజాన్ మాసంలో సహర్, ఇఫ్తార్‌లు ముస్లింలకు ఎంతో కీలకం. నెల రోజులపాటు ఉపవాస దీక్ష పాటించే వారంతా, ఈ రెండింటికీ అధిక ప్రాధాన్యత ఇస్తుంటారు. ఈ రెండు పదాలకు అర్థం, విశేషాలు తెలుసుకునేందుకు అనేక మంది అసక్తి చూపిస్తుంటారు. దీనిపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

సహర్ అంటే..

పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు నెల రోజుల పాటు రోజా(ఉపవాసం) పాటిస్తుంటారు. ఈ రోజా దీక్ష ఎంతో కఠోరమైంది. ఇందులో భాగంగా సూర్యోదయం ముందు, సూర్యాస్తం తరువాత మాత్రమే ఆహారం తీసుకుంటారు. కాగా, సహర్ అంటే తెల్లవారుజామున (నిర్ణిత సమయంలోపు) భోజనం లేదా రోటి లేదా పండ్లు, ఖర్జూరాలను ఆహారంగా తీసుకోవడం. ఈ ప్రక్రియను పూర్తి చేయకపోతే రోజా లేనట్లేనని వారి నమ్మకం. నిర్ణిత సమయం దాటిన తర్వాత చేయాల్సి వస్తే బీన్ సైరీ(ఏలాంటి ఆహారాన్ని తీసుకోకుండా) పాటించే వారు కూడా ఉంటారు. సహర్‌ను ఫజర్ నమాజ్ (తెల్లవారుజామున చేసే నమాజ్) చేసే లోపే చేయాల్సి ఉంటుంది.

ఇఫ్తార్ ఇలా..

తెల్లవారుజాము నుంచి సాయంత్రం వేళ వరకు రోజా పాటించి, సాయంత్రం వేళ రోజాను విరమించడాన్ని ఇఫ్తార్ అంటారు. దీనిని కూడా నిర్ణిత సమయంలోనే చేయడం వారి అనవాయితీ. రోజంతా ఉపవాస దీక్ష చేసి ఇఫ్తార్ వేళలో ప్రత్యేక ప్రార్ధన చేస్తుంటారు. ఇలా కఠోరమైన రోజాను పాటించి ప్రార్ధన చేస్తే వారి కోరికలను అల్లా నెరవేరుస్తాడని దివ్య ఖురాన్ బోధిస్తోంది. ఇఫ్తార్ (రోజా విరమించడం)ను ఖర్జూరా తినిడంతో విరమించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తారు. ఇవి అందుబాటులో లేని వారంతా వివిధ రకాల పండ్లు, నిమ్మరసంతో ఉపవాస దీక్షను విరమిస్తారు. రోజా విరమణను మగ్రీబ్ నమాజ్‌కు ముందే పూర్తి చేసి, ఆ తర్వాత నమాజ్ పాటిస్తారు. ఇళ్లకు వెళ్లిన తర్వాత భోజనం తింటారు.

సండే స్పెషల్

మసీదుల్లో సందడి..

సహర్, ఇఫ్తార్ పాటించే సమయాల్లో మసీదుల్లో ఎంతో సందడి ఉంటుంది. కొన్ని మసీదుల్లో సహర్ పాటించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు కూడా ఉంటాయి. దూర ప్రయాణాలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం కొన్ని మసీదుల్లో వారికి అవసరమైన ఆహారాన్ని అందుబాటులో ఉంచడం లేదా, స్థానికుల వద్ద నుంచి సేకరించి ఉంచుతారు. దాంతో కొన్ని మసీదుల్లో సహర్ వేళలో, అత్యధికంగా మసీదుల్లో ఇఫ్తార్ వేళలో రద్దీ ఉంటుంది. ఇఫ్తార్‌ను తప్పనిసరిగా మసీదుల్లోనే పాటించేందుకు ముస్లిం సోదరులు ప్రాధాన్యత ఇస్తుంటారు. మహిళలు మాత్రం వారి ఇళ్లలోనే ఈ రెండింటిని పాటిస్తారు.

అభివృద్ధికి నిధులు మంజూరు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేట: అశ్వారావుపేట నియోజకవర్గ అభివృద్ధికి గడిచిన రెండున్నర నెలల్లో అధికా స్థాయిలో నిధులు మంజూరు చేయించినట్లు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉపాధి హామీ నిధులు, స్పెషల్ గ్రాంట్‌లలో సుమారు రూ.6కోట్లతో అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తెలిపారు. రూ.2 కోట్లను పాఠశాలల అభివృద్ధికి, నీటి వసతికి రూ.కోటి మంజూరు చేయించామన్నారు. సీసీ రహదారులు 90 శాతం పూర్తయ్యాయని అన్నారు. సీపీఐ నాయకులు సయ్యద్ సలీం, గన్నిన రామృష్ణ పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా పరిష్కరిస్తామన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు సుంకవల్లి వీరభద్రారావు, మొగ్గళ్లపు చెన్నకేశవరావు, జేష్ట సత్యనారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మండలంలో పర్యటన

దమ్మపేట: నియోజకవర్గ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. శనివారం మండల పరిధిలో సుడిగాలి పర్యటన చేసిన ఎమ్మెల్యే, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రెడ్యాలపాడు, రాళ్లబంజర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీలతో కలిసి గడ్డ పలుగుతో ఉపాధి హామీ పని చేశారు. వేసవి కాలం దృష్ట్యా కూలీలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచనలు చేశారు. గణేష్‌పాడు గ్రామంలో ఆధునీకరించిన గ్రామ పంచాయతీ భవనాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం నాచారం గ్రామంలో పలు శుభకార్యాలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సోయం ప్రసాద్, ఎంఈఓ కీసర లక్ష్మి, ఎంపీటీసీ కోటగిరి సత్యావతి, పలువురు ప్రజా ప్రతినిధులు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చెక్‌డ్యాం నిర్మాణానికి అంచనాలు



చెక్‌డ్యాం నిర్మాణంపై రైతులతో చర్చిస్తున్న ఏఈ భాస్కర్‌రావు

అశ్వాపురం: ఈ నెల 14న మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామంలో పర్యటించిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు స్థానిక రైతులు గ్రామంలో కొల్లు చంద్రమ్మ వాగు వద్ద చెక్ డ్యాం నిర్మించాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే పాయం అధికారులను వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. దీంతో ఇరిగేషన్ ఏఈ భాస్కర్‌రావు శనివారం వాగు ప్రాంతాన్ని సందర్శించి రైతులతో మాట్లాడి చెక్ డ్యాం నిర్మాణంపై చర్చించారు. అంచనాలు వేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాకా అశోక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, బూరెడ్డి వెంకటరెడ్డి, మొగిళ్ల పెద వీరారెడ్డి, కొమ్ము భద్రయ్య, తోకల వీరయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్త



మాట్లాడుతున్న డాక్టర్ నిశాంత్‌రావు

మణుగూరురూరల్: పిల్లల్లో వచ్చే క్షయ వ్యాధి జాగ్రత్తలపై మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ నిశాంత్ రావు మాట్లాడుతూ.. ఇంట్లో ఉన్న క్షయ వ్యాధిగ్రస్తుల వల్ల చిన్న పిల్లల్లో ఇమ్యూనిటీ తక్కువగా ఉంటుందని, తద్వారా పిల్లల్లో కూడా త్వరగా క్షయ వ్యాధి వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులను పిల్లలకు దూరంగా ఉంచాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాతి ఎన్‌జీఓ ప్రభాకర్, సీహెచ్‌ఓ వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్స్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



అన్నపురెడ్డిపల్లి: పరీక్ష ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంఈఓ సత్యనారాయణ

అన్నపురెడ్డిపల్లి: రేపటి నుంచి జరగనున్న పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ సత్యనారాయణ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలోని పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించారు. మండలంలో రెండు పరీక్ష కేంద్రాలలో మొత్తం 249 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవనున్నట్లు తెలిపారు. పది పరీక్షల ఏర్పాట్లను తహసీల్దార్ జగదీ్వర్ ప్రసాద్, ఎంపీడీఓ మహాలక్ష్మి వేరువేరుగా పరిశీలించారు.

ములకలపల్లి: రేపటి నుంచి జరుగనున్న పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంఈఓ శ్రీరామ్మూర్తి తెలిపారు. మండల పరిధిలో 269 మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరుకానున్నారని వెల్లడించారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, గురుకుల బాలికల విద్యాలయాల్లో పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అశ్వారావుపేటరూరల్: పదో తరగతి వార్షిక పరీక్షలకు పకబ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంఈఓ పెండెకంట్ల కృష్ణయ్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. మండలంలో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు, మొత్తం 642మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలోని 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ నర్సింహారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. చంద్రుగొండ, అయన్నపాలెం, తిప్పనపల్లి, సత్యనారాయణపురం, రావికంపాడు, బాలికుంట, బెండాలపాడు, గుర్రాయిగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వెల్లడించారు.

ములకలపల్లి: ములకలపల్లి మండలంలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మీనర్సింహారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో సాధారణ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు.

మండల అధ్యక్షులు ఖరారు

భద్రాచలం: నియోజకవర్గంలోని భద్రాచలం, దుమ్ముగూడెం మండలాల కాంగ్రెస్ పార్టీ మండల నూతన అధ్యక్షులను నియమిస్తూ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య శనివారం ఉత్తర్వులను అందజేశారు. భద్రాచలం టౌన్ ప్రెసిడెంట్‌గా పరిమి శ్రీనివాసరావు, టౌన్ జనరల్ సెక్రటరీగా దూదిపట్ల కోటేష్, దుమ్ముగూడెం మండల అధ్యక్షుడిగా వీరమాచినేని విసీల్‌లను నియమిస్తూ నియామక పత్రాలను అందజేశారు.

ఒలంపియాడ్‌లో ప్రతిభ

మణుగూరురూరల్: 2023–24 విద్యాసంవత్సరానికి గానూ ఇంటర్నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ లెవల్–2 పోటీ పరీక్షలో గుట్టమల్లారంలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు 61 బంగారు పతకాలు, కన్సోలేషన్ గోల్డ్ మెరిట్ సర్టిఫికెట్లు 58, మెరిట్ సర్టిఫికెట్లు 267 సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయికృష్ణప్రసాద్ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయన అభినందించారు. అకాడమిక్ డీన్ సి.నరేష్, బ్యాచ్ ఇన్‌చార్జ్ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల నిర్వహణ

దుమ్ముగూడెం: మండలంలోని ములకపాడు ప్రభుత్వ ఆస్పత్రి గ్రౌండ్‌లో ఎఫికర్ సంస్థ అధ్వర్యంలో శనివారం క్రీడా పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథి ఆర్‌ఐ ఆదినారాయణ పాల్గొని, క్రీడల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఎఫికర్ సంస్థ నుండి ధర్మరాజు, మల్లయ్య, కిరణ్ బాబు, సావిత్రి, వెంకటేష్ ,సావిత్రి, జాను బాబు పాల్గొన్నారు.

ప్రహరీకి శంకుస్థాపన

దమ్మపేట: మండల కేంద్రంలో ముస్లింలకు కేటాయించిన ఖబ్రస్తాన్ (శ్మశాన వాటిక)కు ఏర్పాటు చేయనున్న గోడ నిర్మాణ పనులకు మసీద్ కమిటీ సభ్యులు, మండల కాంగ్రెస్ నాయకులు కలసి శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిన్నశెట్టి యుగంధర్, పగడాల రాంబాబు, మైనారిటీ నాయకులు ఎండి.వలీపాషా, దస్తగీర్, గౌస్, రహీమ్, ఫయాజ్ పాల్గొన్నారు.

20న విగ్రహ ప్రతిష్ఠాపన

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామంలో ఈ నెల 20వ తేదీన నూతనంగా నిర్మించిన రామాలయంలో విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ, గ్రామపెద్దలు శనివారం తెలిపారు. నాభిశిల ప్రతిష్ఠాపన ఉంటుందని, 18వ తేదీ నుంచే ప్రత్యేక పూజలు ఉంటాయని ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అశ్వాపురం: రాళ్లవాగుపై వంతెనకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాక గ్రామంలో రాళ్లవాగుపై రూ.3.80 కోట్లతో నిర్మించనున్న వంతెనకు శనివారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శంకుస్థాపన చేశారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు వేగవంతంగా చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆర్ అండ్‌బీ ఈఈ వెంకటేశ్వరరావు, ఏఈ రాంబాబు, ఎంపీపీ ముత్తినేని సుజాత, జిల్లా, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు షర్ఫియుద్దీన్, ఎస్‌కె.ఖధీర్, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు కమటం నరేష్, ఎంపీటీసీలు గాదె జయ, బేతం రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, నాయకులు పాల్గొన్నారు.

చెక్‌డ్యాం నిర్మాణానికి భూమిపూజ..

కరకగూడెం: మండలంలోని కన్నాయిగూడెం గ్రామ పంచాయతీలోని బంగారుగూడెం పెద్ద వాగు మీద సుమారు రూ.16 కోట్ల వ్యయంతో చెక్ డ్యామ్ నిర్మాణం కోసం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం భూమి పూజ చేశారు. నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో మరిన్ని గ్యారెంటీలను అమలు చేస్తూ ప్రజల కష్టాలను దూరం చేస్తామని పేర్కొన్నారు. అనంతరం చెక్ డ్యామ్ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించి సరదాగా జేసీబీ యంత్రాన్ని నడిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

బూర్గంపాడు: తహసీల్దార్ కార్యాలయంలో శనివారం మండలంలోని 33మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కల్యాణలక్ష్మి చెక్కులను అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముజాహిద్దీన్, ఎంపీడీఓ జమలారెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గుండాల: ఆళ్లపల్లి మండలంలో కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు అందించారు. పినపాక నియోజక వర్గంలో అన్ని మండలాల అభివృద్ధికి నిధులు తీసుకువచ్చి అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య, తహసీల్దార్ శకుంతల, మండల నాయకులు పాయం రాంనర్సయ్య, తాళ్లపల్లి వెంకన్న, పడిగె సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గుండాలలో..

గుండాల మండలంలో ఎస్టీ లబ్దిదారులైన 73 మందికి కల్యాణ లక్ష్మి చెక్కులను ఎంపీపీ ముక్తి సత్యం, జెడ్పీటీసీ వాగబోయిన రామక్కలు పంపిణీ చేశారు. ఎంపీటీసీలు కల్తి కృష్ణారావు, కల్తి రాజేశ్వరి, పర్శక పద్మ, తహసీల్దార్ ఇమ్మానియేల్, ఆర్‌ఐ నాగేశ్వరావు, జోగయ్య , కార్యదర్శి రాంమోహన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



మణుగూరుటౌన్: విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న మణుగూరు సీఐ, కాంగ్రెస్ నాయకులు

మణుగూరుటౌన్: జెడ్పీ హైస్కూల్లో మణుగూరు పొంగులేటి యువసేన ఆధ్వర్యంలో శనివారం పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమానికి మణుగూరు సీఐ సతీష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చిన్న విషయాలకు భావోద్వేగాలకు లోనవకుండా ఉన్నత లక్ష్యాలు ఏర్పరుచుకుని ముందుకు సాగాలని సూచించారు. అనంతరం మణుగూరు పొంగులేటి యువసేన అధ్యక్షుడు ప్రతాప్ ఆధ్వర్యంలో సీఐ సతీష్ చేతులమీదుగా 134 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగశ్రీ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్, శివ, సీనియర్ నాయకులు సామా శ్రీనివాసరెడ్డి, గణేశ్ రెడ్డి, పెనుగొండ సాంబశివరావు, యువసేన నాయకులు కరణ్‌కర్, కిరణ్, తిప్ప శ్రీను, అఖిల్, అనిల్‌రెడ్డి, ప్రీతమ్, వహీద్, రామయ్య, రామ్ సాయి రవికుమార్ తదితరులు ఉన్నారు.

దమ్మపేట: మండలంలోని దురదపాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యుక్తా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, స్కేళ్లు, తినుబండారాలను వితరణగా అందజేశారు. యుక్తా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మనువడు వల్లభనేని హితేష్ వీటిని అందజేసి పాఠశాలలో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. సమస్యలను మంత్రి తుమ్మలకి తెలియజేసి, పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాసాని నాగప్రసాద్, తుమ్మల శేషబాబు, ఎర్రా వసంతరావు, సత్యనారాయణ, అప్పారావు, మంగేశ్వరరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడా



మణుగూరురూరల్: గర్భిణికి సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

మణుగూరురూరల్: మండలంలోని కూనవరం, సమితిసింగారం గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం పోషణ పక్వాడా కార్యక్రమాలను నిర్వహించారు. ఎన్టీఆర్ నగర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ పక్వాడ కార్యక్రమానికి ఐసీడీఎస్ సీడీపీఓ జయలక్ష్మి హాజరై పోషకాహారం గురించి గర్భిణులు, పిల్లల తల్లులు, బాలింతలకు వివరించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. పోషణ పక్వాడా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజిని, ఏఎన్ఎం లక్ష్మీకుమారి, అంగన్‌వాడీ టీచర్లు వీసం లీలావతి, రాజేశ్వరి, వీరకుమారి, జయలక్ష్మి, మాజీ వార్డ్‌మెంబర్లు వంక సూరయ్య, తోలెం రాజేశ్వరి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ములకలపల్లి: గర్భిణులు, బాలింతలు విధిగా పోషకాహారాన్ని తీసుకోవాలని జగన్నాథపురం క్లస్టర్ సూపర్‌వైజర్ నాగమణి సూచించారు. ముత్యాలంపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్‌పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. ప్రతిజ్ఞ చేశారు. అంగన్‌వాడీ టీచర్ యు.లక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పాఠశాల కమిటీ ఎన్నిక

బూర్గంపాడు: సోంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీని శనివారం ఎన్నుకున్నారు. పాఠశాల హెచ్‌ఎమ్ మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ ఎన్నికలలో కమిటీ చైర్మన్‌గా తోకల అనితను ఎన్నుకున్నారు. ప్రతి తరగతి నుంచి ముగ్గురు విద్యార్థుల తల్లిదండ్రులను సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ పదవీకాలం రెండేళ్ల వరకు ఉంటుంది. పాఠశాలలో మౌలికవసతుల కల్పన, మధ్యాహ్న భోజన పథకం అమలుతీరు, విద్యార్థుల హాజరుశాతం పెంచటం వంటి పనులను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. కార్యక్రమంలో పండగ రాములు,గాదె నర్సిరెడ్డి, బాగి వెంకట్రావు, నస్కూరి లక్ష్మీనారాయణ, సైదులు,రవి, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

కవిత అరెస్టుపై నిరసన



ములకలపల్లి: రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎమ్మెల్సీ కవిత అరెస్టును నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు పలు చోట్ల శనివారం నిరసనలు వ్యక్తం చేశారు. రహదారులపై ధర్నాలు, నల్ల కండువాలతో వీధుల్లో రాస్తారోకోలు నిర్వహించారు. కొన్ని చోట్ల బంద్‌కు పిలుపునివ్వడంతో వ్యాపార సముదాయాలు మూసివేశారు. నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంకుశ వైఖరిని అనుసరిస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో కవితపై అక్రమంగా కేసులు పెట్టారని, వెంటనే ఆమెను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



పినపాక: బయ్యారం క్రాస్ రోడ్‌లో ధర్నా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



చంద్రుగొండ: జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు